RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.


ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 265 | సంపుటి 4 | మంగళవారం | 23-06-2026 | పేజీలు 4 | వెల 3/-



## ఈసారి ఈ 7 రకాల
# సన్నాలకే బోనస్

- ఎంపిక చేసిన 7 రకాల సన్న వరికే ప్రభుత్వ బోనస్
- విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా జాబితా పరిశీలించాలి
- విత్తన మేళాల ద్వారా అవగాహన.. సాగు చేసిన వారికే ప్రోత్సాహకాలు
- ఎంఎస్పీతో పాటు రూ.500 ప్రోత్సాహకం ఇచ్చే యోచన
- బిల్లు భద్రపరిస్తేనే సబ్సిడీ.. ఏఈవో పరిశీలన తప్పనిసరి
- 33 రకాల నుంచి 7 రకాలకే పరిమితమైన ప్రభుత్వ ప్రోత్సాహం
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సన్నాల సాగుపై సర్కారు దృష్టి
- రైతు వేదికల్లో విత్తన మేళాలు.. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు
- విత్తనాల కొనుగోలు నుంచి సబ్సిడీ వరకు కొత్త విధానం అమలు
- సాగు ధ్రువీకరణ తర్వాతే సబ్సిడీ.. పారదర్శకతకు పెద్దపీట




**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

రాష్ట్రంలో ఖరీఫ్ వరి సాగును నాణ్యమైన సన్న రకాల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సీజన్‌లో ఎంపిక చేసిన ఏడు రకాల సన్న వరినే సాగు చేయాలని రైతులకు సూచిస్తూ, వాటికే కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)తో పాటు క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు జూన్ 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించనుంది.

### ఈ 7 రకాలకే ప్రాధాన్యం

రాష్ట్రంలో ఇప్పటివరకు రైతులు 33 రకాల సన్న వరి విత్తనాలు సాగు చేస్తుండగా, కొనుగోలు సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు స్వీకరించకపోవడం, ప్రైవేట్ మిల్లర్లు తక్కువ ధరలకు కొనుగోలు చేయడం, తరుగుల పేరుతో అదనపు కోతలు విధించడం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఏడు రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది.

### ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్నాలు

**1. తెలంగాణ సోన (RNR-15048)**
- పంట కాలం: 120–125 రోజులు
- బ్లాస్ట్ వ్యాధిని తట్టుకునే సామర్థ్యం
- 67 శాతానికి పైగా హెడ్ రైస్ రికవరీ

**2. సాంబ మసూరి (BPT-5204)**
- పంట కాలం: 145–150 రోజులు
- సుగంధభరితమైన గింజ
- ఎగుమతులకు అనువైన రకం

**3. కేఎన్ఎం-1638**
- పంట కాలం: 125–130 రోజులు
- వ్యాధి నిరోధకత ఎక్కువ

**4. హెచ్ఎంటీ సోన**
- పంట కాలం: 135–145 రోజులు
- సూపర్ ఫైన్ తెల్లని గింజ
- మార్కెట్‌లో అధిక డిమాండ్

**5. జైశ్రీరాం**
- పంట కాలం: 125–130 రోజులు
- అధిక దిగుబడి
- ఖరీఫ్, యాసంగి రెండింటికీ అనుకూలం

**6. వీజీఎల్-44**
- పంట కాలం: 130–145 రోజులు
- అన్ని రకాల నేలలకు అనుకూలం
- స్థిరమైన దిగుబడి

**7. కేఎన్ఎం-7715**
- పంట కాలం: 125–130 రోజులు
- సూపర్ ఫైన్ రకం
- మార్కెట్‌లో మంచి గిరాకీ

### 38 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం

వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 69 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇందులో 38.19 లక్షల ఎకరాల్లో ఈ ఏడు రకాల సన్న వరినే సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ఏడాదితో పోలిస్తే 10.31 లక్షల ఎకరాలు అదనంగా సాగు చేయాలని ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో ప్రత్యేక విత్తన మేళాలు నిర్వహించి, ఈ ఏడు రకాల ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ బోనస్, దిగుబడి వివరాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. దీంతో రైతులు సరైన విత్తనాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది.

### సబ్సిడీ పొందాలంటే ఇలా...

విత్తనాలు కొనుగోలు చేసే రైతులు ముందుగా పూర్తి ధర చెల్లించి బిల్లును తప్పనిసరిగా భద్రపరచుకోవాలి. అనంతరం పంట సాగు చేసిన తర్వాత వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొనుగోలు చేసిన విత్తనాలనే సాగు చేసినట్లు ధ్రువీకరిస్తారు. ఆ తర్వాతే విత్తన సబ్సిడీ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది.




## భూపాలపల్లిలో
# బొగ్గు టిప్పర్ బీభత్సం

- వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అదుపుతప్పి డీటీఓ వెంకన్న ఢీ కొట్టిన వాహనం
- తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం
- విధులు నిర్వహిస్తుండగా కార్యాలయం ముందే దారుణం
- 15 రోజుల ముందే బదిలీ.. అంతలోనే
- ఘటనపై సమగ్ర విచారణకు మంత్రి పొన్నం ఆదేశాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యంత విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా రోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణా అధికారి (డీటీఓ) బి. వెంకన్న (45)ను అదుపు తప్పిన బొగ్గు టిప్పర్ లారీ ఢీకొట్టి బలితీసుకుంది. గణపురం మండలం చెల్పూరు శివారులోని జిల్లా రవాణా కార్యాలయం ఎదుట జరిగిన ఈ ఘటన రవాణా శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది. కేవలం రెండు వారాల క్రితమే భూపాలపల్లి డీటీఓగా బాధ్యతలు చేపట్టిన వెంకన్న విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది.




## మోడీ విధానాలతో
# దేశం నాశనం

- దేశంలో మతం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ
- రామమందిర నిర్మాణ నిధుల్లో రూ.5,000 కోట్లు దుర్వినియోగం
- నిధుల గోల్ మాల్ పై విచారణ జరపాలి
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

# ఇందిరమ్మ ఇళ్లకు ఉపాధి హామీ అండ

- లబ్ధిదారులకు 90 రోజుల పని.. అదనంగా రూ.27 వేల వరకు వేతనం
- రూ.5 లక్షల ఇంటి సాయంతో పాటు ఉపాధి హామీ కూలీ కూడా
- జాబ్ కార్డు ఉన్న కుటుంబాలకు ప్రయోజనం.. కలెక్టర్లు, ఎంపీడీవోలకు గుర్తింపు బాధ్యత

2

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. ఇంటి నిర్మాణాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో లబ్ధిదారులు తమ సొంత ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొని 90 రోజుల పాటు ఉపాధి పొందడంతో పాటు రోజుకు సగటున రూ.300 చొప్పున వేతనం పొందనున్నారు. దీంతో ఒక్కో కుటుంబానికి అదనంగా రూ.27 వేల వరకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సాయానికి ఈ మొత్తం అదనంగా లభించనుంది.




# బాధితులకు అండగా 'భరోసా కేంద్రం'

- మహిళలు, చిన్నారుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- పోక్సో, గృహహింస బాధితులకు అన్ని సేవలు సకాలంలో అందించాలి
- జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశంలో ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల బాధితులకు సత్వర న్యాయం, భద్రతతో పాటు గౌరవప్రదమైన పునరావాసం కల్పించడమే ప్రధాన లక్ష్యమని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే బాధితులకు సమర్థవంతమైన సేవలు అందించగలమని ఆయన అన్నారు.




## 30న రైతు భరోసా
# నిధుల విడుదల

- మధిర సభ వేదికగా రూ.9 వేల కోట్లు రిలీజ్ చేయనున్న సీఎం రేవంత్
- 73 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం..
- నిజమైన సాగుదారులకే లబ్ధి లక్ష్యం
- శాటిలైట్ సర్వేతో పారదర్శకత.. సాగు చేసిన భూములకే భరోసా
- అందరికీ ఒకేసారి నిధుల జమకు కసరత్తు
- పడావు భూములు, రియల్ ఎస్టేట్ భూములకు చెక్
- శాటిలైట్ టెక్నాలజీతో రైతు భరోసాకు పారదర్శకత
- పంటల గుర్తింపుతో వేగంగా నష్టపరిహారం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 30న ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయనుండగా, నిజంగా పంటలు సాగు చేస్తున్న రైతులకే లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేయనుంది.

## లోక్ అదాలత్ ద్వారా
# 10,922 కేసుల పరిష్కారం

- సైబర్ బాధితులకు రూ.1.17 కోట్లకు పైగా రిఫండ్ కు కోర్టు ఆదేశాలు
- పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన సన్ ప్రీత్ సింగ్






# లోక్ అదాలత్ ద్వారా 10,922 కేసుల పరిష్కారం

- సైబర్ బాధితులకు రూ.1.17 కోట్లకు పైగా రిఫండ్ కు కోర్టు ఆదేశాలు
- పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా మొత్తం 10,922 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్ నేరాల బాధితులకు రూ.1,17,95,706 రిఫండ్ మొత్తాన్ని అందజేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉన్న వివిధ రకాల కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. పరిష్కరించిన కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 1,880, డిజాస్టర్ మేనేజ్మెంట్ చట్టానికి సంబంధించిన కేసులు 2,864, ఈ–పెట్టి కేసులు 201, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టానికి సంబంధించిన కేసులు 5,977, సైబర్ క్రైమ్ కేసులు 197 ఉన్నాయని వెల్లడించారు. సైబర్ నేరాలకు గురైన బాధితుల బ్యాంకు ఖాతాలకు సంబంధించి నిలుపుదల చేసిన రూ.1.17 కోట్లకు పైగా మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా కోర్టు ఆదేశాలు జారీ చేయడం బాధితులకు ఊరటనిచ్చే అంశమని కమిషనర్ పేర్కొన్నారు. "రాజీ మార్గం రాజమార్గం" అని పేర్కొన్న సీపీ, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు త్వరితగతిన న్యాయం జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. కేసుల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవా సంస్థల అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- గాంధీ భవన్ ముట్టడికి వికలాంగులు సిద్ధం కావాలి
- భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్

**నూతనకల్, జూన్ 22(ప్రభాత గమనం):**


అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో నిర్వహించనున్న గాంధీ భవన్ ముట్టడికి వికలాంగులు, సంఘ నాయకులు సన్నద్ధం కావాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000లకు పెంచడం, అట్రాసిటీ చట్టం–2016 అమలు, ఆర్టీసీ బస్సుల్లో 100 శాతం ఉచిత ప్రయాణం, వికలాంగుల సంక్షేమ శాఖకు ప్రత్యేక గుర్తింపు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆరోపించారు. వికలాంగులపై దాడులు, భూముల ఆక్రమణలు పెరుగుతున్నాయని, వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు, రాష్ట్ర నాయకులు నవీన్ రెడ్డి, మండల అధ్యక్షులు బాణాల వీరారెడ్డి, కొనతం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల పని

**హైదరాబాద్, జూన్ 22(ప్రభాత గమనం):**



రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా లబ్ధిదారులు తమ సొంత ఇంటి నిర్మాణంలో పాల్గొని, 90 రోజుల పాటు రోజుకు సగటున రూ. 300 చొప్పున వేతనం పొందవచ్చు. ఒక్కో కుటుంబానికి అదనంగా రూ. 27,000 వరకు లభించనుంది. ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి ఇచ్చే రూ. 5 లక్షల ఆర్థిక సహాయానికి ఈ ఉపాధి హామీ వేతనం అదనంగా జతకానుంది. జాబ్‌కార్డు కలిగిన లబ్ధిదారులు ఈ ప్రయోజనం పొందవచ్చు. కలెక్టర్లు, ఎంపీడీవోలే నేరుగా లబ్ధిదారులను గుర్తించి 90 రోజుల పనిని మంజూరు చేసే అధికారం కల్పించారు.



# ఘోర రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన ఈస్ట్ జోన్ డీసీపీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

పర్వతగిరి మోడల్ స్కూల్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని సోమవారం ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్ పరిశీలించారు. ప్రమాద స్థలాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులు, కారణాలపై సమగ్రంగా విశ్లేషించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతా చర్యలు, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవసరమైన సూచనలు చేశారు. సంబంధిత అధికారులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# భూపాలపల్లిలో బొగ్గు టిప్పర్ బీభత్సం

- వాహన తనిఖీల్లో డీటీఓ వెంకన్నను ఢీ కొట్టిన వాహనం
- తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం
- విధులు నిర్వహిస్తుండగా ఆఫీస్ ముందే అనంత లోకాలకు
- 15 రోజుల ముందే బదిలీ అంతలోనే విషాదం







**భూపాలపల్లి, జూన్ 22(ప్రభాత గమనం):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గుండెల్ని పిండేసే అత్యంత విషాదకర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విధి నిర్వహణలో భాగంగా రోడ్డుపై నిలబడి వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణా అధికారి (డిటివో) బి. వెంకన్న (45)ను ఒక భారీ బొగ్గు టిప్పర్ లారీ బలితీసుకుంది. పరకాల – భూపాలపల్లి ప్రధాన రహదారిపై గణపురం మండలం చెల్పూరు శివారులో ఉన్న జిల్లా రవాణా అధికారి కార్యాలయం ముందే ఈ దారుణం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం రవాణా శాఖ సిబ్బందితో కలిసి డీటీఓ వెంకన్న కార్యాలయం ముందు రోడ్డుపై వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకునేందుకు ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో విధుల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో పరకాల వైపు నుంచి భూపాలపల్లి వైపు వస్తున్న ఒక బొగ్గు టిప్పర్ లారీ ఒక్కసారిగా అదుపు తప్పి వేగంగా అధికారుల వైపు దూసుకొచ్చింది.

**- కళ్లముందే నుజ్జునుజ్జయిన శరీరం**

రోడ్డు పక్కన ఆపి ఉంచిన ఒక హార్వెస్టర్ వాహనాన్ని, డీటీఓ కారును ఢీకొడుతూ.. అక్కడ నిలబడి ఉన్న వెంకన్నపైకి ఆ లారీ దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు లారీ టైర్లు ఆయనపై నుంచి వెళ్లడంతో వెంకన్న శరీరం మొత్తం నుజ్జునుజ్జయ్యి, తీవ్ర రక్తస్రావంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కళ్లముందే తమ పైఅధికారి ప్రాణాలు కోల్పోవడంతో తోటి సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనకు, దిగ్భ్రాంతికి గురయ్యారు.

**- 15 రోజుల క్రితమే బదిలీపై రాక**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వెంకన్న, కేవలం 15 రోజుల కిందటే (రెండు వారాల క్రితం) జగిత్యాల నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు డీటీఓగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టి రెండు వారాలు కూడా గడవకముందే ఆయన ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవ్వడం రవాణా శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ఘోర ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీ డ్రైవర్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా తెలుస్తోంది.

**- విచారణకు ఆదేశించిన రవాణా శాఖ మంత్రి**

ఈ ప్రమాద వార్త తెలియగానే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉంటూ రవాణా శాఖ అధికారి వెంకన్న మరణించడం అత్యంత విచారకరమని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వెంకన్న కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# మోడీ విధానాలతో దేశం నాశనం

- దేశంలో మతం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ
- రామమందిర నిర్మాణ నిధుల్లో రూ.5,000 కోట్లు దుర్వినియోగం
- నిధుల గోల్ మాల్ పై విచారణ జరపాలి
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

**హైదరాబాద్ జూన్ 22(ప్రభాత గమనం):**



ప్రధాని నరేంద్ర మోదీపై ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదివారం కర్నాటక కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా బి.కె. హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిర్వహించిన మెగా కన్వెన్షన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశంలో మతం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, రామమందిర నిర్మాణం కోసం సేకరించిన నిధుల్లో రూ.5,000 కోట్లు దుర్వినియోగం అయినట్లు నివేదికలు వస్తున్నాయని ఖర్గే ఆరోపించారు. రాముడి పేరుతో దోపిడీ కోసమే ఆలయాన్ని నిర్మించారని, హుండీ డబ్బులన్నీ ఎక్కడికి పోతున్నాయో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.




# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : డీసీపీ భాస్కర్

**మంచిర్యాల, జూన్ 22(ప్రభాత గమనం):**

మంచిర్యాల జిల్లాలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్‌లో జరిగిన అవగాహన సదస్సులో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలపై విద్యార్థులు గీసిన చిత్రాలను డీసీపీ పరిశీలించి, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులు చూపిన అవగాహనను అభినందించారు. తెలిసో తెలియకో డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.

# నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయండి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, జూన్ 22(ప్రభాత గమనం):**



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రైతు వేదికలలో ఈ నెల 23 నుండి 30వ వరకు "విత్తన మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వచ్చే వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా ఈ విత్తన మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన 7 సన్న రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై కొనుగోలు చేసుకునే అవకాశం ఈ మేళా ద్వారా కల్పించబడిందని, అలాగే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు పంట నిర్వహణపై సాంకేతిక సలహాలు అందజేస్తారని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమీప రైతు వేదికలో నిర్వహించే విత్తన మేళాలో పాల్గొని, తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 18 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




వర్ధన్నపేట మండలం పరిధిలో ఉన్నటువంటి ఫర్టిలైజర్ షాపులను స్థానిక ఎస్సై సాయిబాబు తమ సిబ్బందితో కలిసి విస్తృతగా తనిఖీలు చేపట్టారు నకిలీ విత్తనాల విక్రయాలు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించారు నకిలీ విత్తనాలు అమ్మడం వల్ల పంట నష్టపోయి రైతులు ఎంతగానో ఇబ్బంది పడుతున్నారని కేవలం గుర్తింపు పొందిన డీలర్ల వద్ద నుంచే బిల్లులతో విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో మండలం వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన రాష్ట్ర జేఏసీ

**హైదరాబాద్, జూన్ 22(ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని రాష్ట్ర ఉపాధి హామీ ఉద్యోగుల చైర్మన్ ఎలబద్రి లింగయ్య సమక్షంలో రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ కొత్త గ్రామీణ ఉపాధి హామీ చట్టం 'వీబీ జి రామ్ జి' (వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) పై శనివారం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం ముగిసిన అనంతరం ఈ భేటీ జరిగింది. సబ్ కమిటీ చైర్మన్‌గా ఉన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి జేఏసీ నాయకులు తమ సమస్యలపై ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ నాయకులు మాట్లాడుతూ... ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన 'పేస్కేల్'ను వీలైనంత త్వరగా అమలు చేయాలని మంత్రిని కోరారు. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న ఈ సమస్యను పరిష్కరించి, ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించాలని వారు విన్నవించారు. జేఏసీ ప్రతినిధుల వినతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.



# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- గూగుల్ మీట్ ద్వారా దరఖాస్తుల పరిష్కారానికి ఆదేశాలు

**మహబూబాబాద్, జూన్ 22(ప్రభాత గమనం):**



సోమవారం జిల్లా కలెక్టర్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధు సూదన రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నితీష్ , జిల్లా అధికారులు, అన్ని విభాగాల సిబ్బందితో కలిసి కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా వ్యాప్తంగా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని అన్నారు. భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పెన్షన్లు, పంచాయతీరాజ్, మున్సిపల్ సంబంధిత విభాగాలపై అధిక శాతం దరఖాస్తులు వస్తున్నాయని, జిల్లా కలెక్టరేట్ తో పాటు, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాలు తొర్రూరు డివిజన్, మహబూబాబాద్ డివిజన్ పరిధిలో కూడా ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని, ప్రజలకు వేగంగా, సత్వర సేవలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో పారదర్శకంగా దరఖాస్తులను ఆన్లైన్ చేసి విభాగాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సోమవారం గార్ల మండలం కోట్యా నాయక్ తండాకు చెందిన దారావత్ నరసింహ తన భూమికి సంబంధించి సర్వే ల్యాండ్ రికార్డు వారికి దరఖాస్తు చేసుకున్నానని ఇంతవరకు తన భూమిని సర్వే చేయలేదని తన భూమిని సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. మహబూబాబాద్ మండలం వి.ఎస్.లక్ష్మీపురం కు చెందిన ఆనంద్ తనకున్న వ్యవసాయ భూమి హోల్డ్ లో ఉందని అట్టి హోల్డ్ లో నుండి తీసివేసి తనకు న్యాయం చేయాలని కోరారు. మరిపెడ మండలం లక్ష్మా తండ గ్రామానికి చెందిన లునావత్ సుక్కీ తాను గతంలో లక్ష్మా తండ లో అంగన్ వాడీ ఆయా గా పనిచేశానని, తాను ఇప్పుడు పదవ తరగతి పాసై ఉన్నానని అదే కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ టీచర్ గా తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరారు. అన్ని కలిపి జిల్లా వ్యాప్తంగా ఈరోజు ( 172 ) దరఖాస్తులు వచ్చాయని సంబంధిత విభాగాలకు పంపి చర్యలు తీసుకొనుటకు ఆదేశించడం జరిగిందన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ చంద్ర, పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ట్రైబల్, ఎస్సీ, కార్పొరేషన్ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాసరావు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ రవి రాథోడ్, అన్ని విభాగాల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నేటి నుంచి కేసముద్రంలో 'విత్తన మేళా'..

- సబ్సిడీ వరి రకాలు, నానో ఎరువులు సిద్ధం..!
- రైతు వేదికల్లో వారం రోజుల పాటు విత్తన పంపిణీ, అవగాహన సదస్సులు
- ప్రభుత్వం బోనస్ ఇచ్చే బిపిటి, ఆర్ఎన్ఆర్ రకాలు అందుబాటులో..
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి : మండల ఏవో బి. వెంకన్న

**కేసముద్రం, జూన్ 22 (ప్రభాత గమనం) :**

వానకాలం పంటల సాగుకు సమయం ఆసన్నమవడంతో కేసముద్రం మండల రైతాంగానికి వ్యవసాయ శాఖ శుభవార్త చెప్పింది. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు మండల కేంద్రంలోని 'రైతు వేదిక' లో భారీ విత్తన మేళాకు సర్వం సిద్ధం చేశారు. జూన్ 23 మంగళవారం నుండి ప్రారంభం కానున్న ఈ మేళా, జూన్ 30వ తేదీ వరకు వారం రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది.ఈ విత్తన మేళాలో ప్రభుత్వం ప్రత్యేకంగా బోనస్ అమలు చేస్తున్న నాణ్యమైన వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఈ క్రింది రకాలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. కేవలం వరి మాత్రమే కాకుండా.. వివిధ రకాల పప్పుధాన్యాలు, అపరాల విత్తనాలతో పాటు నాణ్యమైన కూరగాయల విత్తనాలను కూడా ఇక్కడ విక్రయిస్తారు. వీటితో పాటు సాంప్రదాయ ఎరువుల వాడకాన్ని తగ్గించి, దిగుబడి పెంచే ఆధునిక నానో యూరియా, నానో డీఏపీ వంటి అత్యాధునిక వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు అందుబాటులో ఉంచారు. వీటి వినియోగంపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఆయా గ్రామాల సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, 'టామ్ టామ్' (దండోరా) ద్వారా రైతులందరికీ సమాచారం చేరవేయాలని మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న కోరారు."రైతు సోదరులంతా దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వం అధికారికంగా రైతు వేదిక ద్వారా అందిస్తున్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. నాణ్యమైన విత్తనాలు పొంది, అధిక దిగుబడులు సాధించాలి.

# అన్నదాతల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడతారా?

- కేంద్రం కోటా సాకుతో చేతులెత్తేయడం ద్రోహమే
- క్వింటాల్ కు రూ.500 బోనస్ అంతా బోగసే
- ప్రతి గింజనూ కొనుగోలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతమే
- మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ హెచ్చరిక

**గార్ల, జూన్ 22 (ప్రభాత గమనం) :**



సరిహద్దులు దాటి దేశానికే అన్నం పెట్టే తెలంగాణ రైతాంగాన్ని ఢిల్లీ పాలకుల లెక్కల ముందర మోకరిల్లజేయడం ముమ్మాటికీ ద్రోహమేనని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం విధించిన టార్గెట్లను సాకుగా చూపిస్తూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోళ్ల బాధ్యత నుండి తప్పుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది స్వేచ్ఛా తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అన్నదాతల హక్కులను నడిరోడ్డుపై దగా చేయడమేనని మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు."కేంద్రం పెట్టిన టార్గెట్ మేరకే కొంటాం.. లేకపోతే గింజ కూడా ముట్టం అని రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణం. తెలంగాణ రైతుల శ్రమను కేంద్ర కోటా పరిమితులకు బందీ చేయడం ఈ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం. వ్యవసాయం అంటే పాలకులకు కేవలం లెక్కల వ్యాపారమేమో కానీ, రైతుకు అది ప్రాణం" అని రమేష్ వ్యాఖ్యానించారు. ధాన్యానికి క్వింటాలుకు ₹500 బోనస్ ఇస్తున్నామని ప్రభుత్వం చేసుకుంటున్న ఆర్భాటపు ప్రచారమంతా వట్టి మాయాజాలమేనని ఆయన కొట్టిపారేశారు. క్షేత్రస్థాయిలో సగం మందికి కూడా ఆ బోనస్ అందకుండా రకరకాల ఆంక్షల ఉచ్చు బిగించారని ఆరోపించారు. ఒకచేత్తో బోనస్ ఆశ చూపిస్తూనే, మరోచేత్తో అసలు కొనుగోలు కేంద్రాలకే తాళాలు వేసే కుట్రలకు ప్రభుత్వం తెరలేపిందని దుయ్యబట్టారు.ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు నడిరోడ్డుపై దళారీలు, రైస్ మిల్లర్ల దోపిడీకి గురవుతున్నారని శీలంశెట్టి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల ఆగ్రహానికి గురైన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని, తక్షణమే కొనుగోళ్లు చేపట్టకపోతే ఈ ప్రభుత్వానికి రైతాంగమే చరమగీతం పాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# హసన్‌పర్తి పరిధిలో పోలీసుల విస్తృత తనిఖీలు

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : ఇన్ స్పెక్టర్ ఆకునూరి మహేందర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం, పోలీస్ శాఖ చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా హసన్‌పర్తి పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు నేషనల్ హైవే-563తో పాటు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో స్థానిక పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. ప్రత్యేక శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్స్ సహాయంతో కిరాణా దుకాణాలు, హోటళ్లు, అనుమానాస్పద ప్రాంతాలు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారం లేకుండా మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యం కాదని పేర్కొన్న ఆయన, తమ ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, సమాజాన్ని నాశనం చేసే ఈ దుష్ప్రవర్తనపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ ఆకునూరి మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, పోలీస్ అధికారులు, సిబ్బంది, డాగ్ స్క్వాడ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ తో జీవితాలు అంధకారం

- గార్ల ఎస్ఐ సాయి కుమార్
- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా 'యాంటీ డ్రగ్స్ డే'
- విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

**గార్ల, జూన్ 22 (ప్రభాత గమనం):**




క్షణికానందం కోసం అలవాటు పడే మాదకద్రవ్యాల (డ్రగ్స్) వ్యసనం యువత ఉజ్వల భవిష్యత్తును చీకట్లోకి నెట్టేస్తుందని గార్ల సబ్ ఇన్‌స్పెక్టర్ (SI) సాయి కుమార్ హెచ్చరించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గార్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల (AGHS) లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ సాయికుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.డ్రగ్స్ బారిన పడటం వల్ల కలిగే తీవ్రమైన అనారోగ్య సమస్యలను, శారీరక, మానసిక దుష్ప్రభావాలను ఎస్ఐ విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. సరదాగా మొదలయ్యే అలవాట్లు జీవితాంతం కోలుకోలేని దెబ్బ తీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలని ఆయన పిలుపునిచ్చారు.నార్కోటిక్స్ (మాదకద్రవ్యాల) రవాణా, విక్రయాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. డ్రగ్స్ నెట్‌వర్క్‌లో భాగస్వాములైన వారికి ఎదురయ్యే తీవ్రమైన చట్టపరమైన పరిణామాలు, జైలు శిక్షల గురించి విద్యార్థులను హెచ్చరించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నినాదాలు ఆలోచింపజేశాయి.

# 'రాజ్యాధికార సమరభేరి'కి తరలిరావాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా టీఆర్పీ నాయకులతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేటీ
- 16 మండలాల అధ్యక్షులు హాజరు...
- రాజ్యాధికార సమరభేరి సభ నిర్వహణపై చర్చ

**హైదరాబాద్, జూన్ 22(ప్రభాత గమనం):**




యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారితో పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు.జిల్లా అధ్యక్షులు కొమ్మరిశెట్టి నరసింహులు ఆధ్వర్యంలో జిల్లాలోని 16 మండలాల పార్టీ అధ్యక్షులతో పాటు ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ..జూలై 5వ తేదీన భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా సభ ఏర్పాట్లు, నిర్వహణ, జన సమీకరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. సభను విజయవంతం చేయడం ప్రతి నాయకుడి బాధ్యతగా భావించి కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా నియమితులైన మండలాల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పసల ప్రసన్న కుమారి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నరసయ్య గౌడ్,జిల్లా మహిళా అధ్యక్షురాలు బుద్ధుల సునీత, జిల్లా నాయకులు బీకు నాయక్,యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు శిఖ రమేష్, భువనగిరి మండల అధ్యక్షుడు అన్నంపట్ల బాలస్వామి, బీబీనగర్ మండల అధ్యక్షుడు మహేందర్ ,వలిగొండ మండల అధ్యక్షుడు బొందుగుళ్ల నరసింహ, రామన్నపేట మండల అధ్యక్షుడు ఉపేందర్ ,చౌటుప్పల్ మండలాధ్యక్షులు కడాల యాదగిరి,పోచంపల్లి మండల అధ్యక్షుడు గజ్జల ఉమాశంకర్,రాజాపేట మండల అధ్యక్షుడు నరసింహ, ఆలేరు మండల అధ్యక్షుడు చింతపండు వెంకటేశం,మోటకొండూరు మండల అధ్యక్షుడు గౌరారం స్వామి, ఆత్మకూర్ మండల అధ్యక్షుడు ఎలిమినేటి బుచ్చయ్య, మోత్కూరు మండల అధ్యక్షులు శ్రీనివాస్, గుండాల మండల అధ్యక్షుడు రమేష్, బొమ్మలరామారం మండల అధ్యక్షుడు బూడిద శ్రీనాథ్ గౌడ్, అడ్డ గూడూరు మండల అధ్యక్షుడు దప్పు యాదగిరి ,తుర్కపల్లి మండల అధ్యక్షుడు గోనె కృష్ణ పాల్గొన్నారు.

# చిన్నారిపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం
- దోషులకు శిక్షపడేలా కృషి చేసిన అధికారులకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకెన్ అభినందనలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 సంవత్సరంలో నమోదైన క్రైం నెం.04/2023, భారతీయ శిక్ష స్మృతి మరియు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద నమోదైన కేసులో విచారణ పూర్తి చేసి ములుగు ప్రత్యేక పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది. ఈ కేసులో నిందితుడు అయిన కొరగట్ల సత్యనారాయణ (45), కన్నాయిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి. బాధితురాలిపై జరిగిన లైంగిక దాడి కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్ర కళ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6,000 జరిమానా విధించారు. అదేవిధంగా బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసు దర్యాప్తులో మొదటి దర్యాప్తు అధికారి మరియు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అప్పటి ఎస్ఐ ఎం. సురేష్, తదుపరి దర్యాప్తు అధికారులు కె. శివప్రసాద్ సీఐ, ఎం. రాజు సీఐలు కీలక పాత్ర పోషించారు. కోర్టులో కేసు సమర్థవంతంగా నడిపించడంలో కోర్టు మానిటరింగ్ అధికారి డి ఎస్ పి కిషోర్ , కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ ఐ నాగరాజు , సీడీఓ సిబ్బంది కానిస్టేబుల్ కె. మౌనిక, పీసీ జె. మంగీలాల్ విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ కేసు దర్యాప్తు అధికారులు, కోర్టు మానిటరింగ్ అధికారి, కోర్టు లైజనింగ్ అధికారి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు కేసు విజయవంతమైన తీర్పుకు సహకరించిన పోలీసు సిబ్బందిని అభినందించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల పట్ల ములుగు జిల్లా పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.



# సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

- ఎంపీడీవోకు సీపీఐ నేతల వినతిపత్రం అందజేత
- కాలువల్లో బ్లీచింగ్, తాగునీటి బావుల శుద్ధీకరణకు విజ్ఞప్తి

**గార్ల, జూన్ 22 (ప్రభాత గమనం) :**

వర్షాకాలం నేపథ్యంలో మండల వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామ పంచాయతీల్లో తక్షణమే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిపిఐ గార్ల మండల సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కి సిపిఐ నాయకులు ఒక వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ ప్రతినిధులు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దోమల నివారణే ధ్యేయంగా ప్రతి గ్రామంలోని మురికి కాలువల్లో (సైడ్ కాలువల్లో) బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, అలాగే ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు గ్రామాల్లోని మంచినీటి బావులను, ట్యాంకులను తక్షణమే శుభ్రపరచాలని కోరారు."గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలి."అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నివారణ చర్యలు నిరంతరం కొనసాగేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు చర్యలతో రక్షించాలని ఈ సందర్భంగా వారు అధికారులను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

## నిర్మూలనకు అందరూ సహకరించాలి : సీపీ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్ వ్యతిరేక వాల్ పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారం రోజులపాటు నిర్వహించనున్న డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలపై సీసీఆర్బీ ఏసీపీ డేవిడ్ రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడే సైనికులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ ఈగల్ ఫోర్స్ రూపొందించిన "ఐ ఆమ్ అన్ ఆంటీ - డ్రగ్స్ సోల్జర్" ఫోటో బూత్‌లో సీపీ ఫోటో దిగుతూ యువతకు స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏసీపీలు డేవిడ్ రాజు, జాన్ నర్సింహులు, వెంకటేష్, ఇన్‌స్పెక్టర్లు సంజీవ్‌రావు, దామెదార్ రెడ్డి, మల్లయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

- కేసముద్రం మండలంలో ప్రమాదం
- ఏరియా ఆసుపత్రిలో బాధితుడికి చికిత్స
- విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఘటన

**కేసముద్రం, జూన్ 22 (ప్రభాత గమనం):**



విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు విద్యుత్ ఘాతానికి గురై ప్రాణాపాయ స్థితికి చేరుకున్న సంఘటన కేసముద్రం మండలంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నారాయణపురం గ్రామ పరిధిలోని బోడ గుట్ట తండాకు చెందిన గుగులోతు యాకూబ్ (35) అనే యువకుడు సోమవారం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్ లైన్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ షాక్ తీవ్రతకు యాకూబ్ కుడి భుజం పూర్తిగా కాలిపోయి, తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు తక్షణమే స్పందించి, బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు."అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సార్లు సమస్యను మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాకూబ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు వదిలిపెట్టేది లేదని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ శాఖ అధికారులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



# నానో యూరియాతో అధిక లాభాలు

- ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి
- యూరియా పంపిణీ విధానాన్ని పరిశీలించిన ఆత్మ చైర్మన్

**నర్సింహుల పేట, జూన్ 22(ప్రభాత గమనం):**

రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా కు అలవాటుపడితేనే అధిక ఉపయోగం ఉంటుందని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు.నరసింహుల పేట మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు యాప్ ద్వారా యూరియా పంపిణీ విధానాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు..యాప్ ఉపయోగించడంలో రైతులకు మొదట్లో కొంత ఇబ్బంది ఉన్న తర్వాత యూరియా కోసం పడిగాపులు కాసే విధానం ఉండదని అవసరమైన ప్రతి రైతుకు యూరియా ఏలాంటి ఇబ్బంది లేకుండా అందుతుందని అన్నారు.యూరియా వాడకాన్ని క్రమంగా తగ్గించి నానో యూరియా కు అలవాటు పడాలని దానితో రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం ఉంటుందన్నారు.ప్రభుత్వం సూచించిన ఆరు రకాల వరి సన్నాలను మాత్రమే రైతాంగం వేయాలని వాటికి మాత్రమే బోనస్ అందడమే కాకుండ ఇబ్బంది లేకుండా అమ్ముకోవచ్చన్నారు. మంగళవారం నుండి రైతు వేదికలలో విత్తనాలు రైతాంగానికి అందుబాటులో ఉండి పారదర్శకంగా పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాకయ్య,ఏవో వినయ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

# 30న రైతు భరోసా నిధుల విడుదల

- మధిర సభ వేదికగా రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- 73 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం..
- నిజమైన సాగుదారులకే లబ్ధి లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 22(ప్రభాత గమనం):**



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 30న ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో రాష్ట్రంలోని 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### అందరికీ ఒకేసారి నిధులు

గత యాసంగి సీజన్‌లో రెండు ఎకరాల లోపు రైతులకే పెట్టుబడి సాయం అందించడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈసారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా రైతులందరికీ ఒకేసారి నిధులు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవేళ నిధుల లభ్యతలో ఇబ్బందులు ఎదురైతే ఎకరం చొప్పున ప్రారంభించి తొమ్మిది రోజుల్లో పూర్తి పంపిణీ చేసే ప్రత్యామ్నాయ ప్రణాళికను కూడా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. సాగు చేయని భూములు, పడావు భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లు, కాలువలు, కుంటలు, బీడు భూములు కలిపి సుమారు 20 నుంచి 25 లక్షల ఎకరాలను రైతు భరోసా జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజల సొమ్ము వృథా కాకుండా నిజంగా పంటలు సాగు చేసే రైతులకే పెట్టుబడి సాయం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది.

### భారీ రైతులకు పరిమితులు?

పేద, మధ్యతరగతి రైతులకు ఎక్కువ ప్రయోజనం చేకూరేలా 10 ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులను రైతు భరోసా జాబితా నుంచి మినహాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. అలాగే భవిష్యత్తులో రైతు భరోసాను ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌కే పరిమితం చేయాలా అనే అంశంపైనా ఉన్నతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఎన్నికల హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందించడంతో పాటు కౌలు రైతులకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కొందరు మంత్రులు ముఖ్యమంత్రికి సూచించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

### శాటిలైట్ టెక్నాలజీతో పారదర్శకత

రైతు భరోసా అమలులో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం శాటిలైట్ సాంకేతికతను వినియోగిస్తోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్‌కు చెందిన సార్ మ్యాప్ సంస్థ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పంటల సర్వే నిర్వహించారు. ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్‌లో, ఏ పంట సాగు చేశారనే వివరాలను 95 శాతం ఖచ్చితత్వంతో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ డేటా ఆధారంగా పంటలు సాగు చేసిన రైతులకే ప్రభుత్వ పథకాల లబ్ధి అందనుంది. ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోయినప్పుడు త్వరితగతిన నష్టపరిహారం అందించడంతో పాటు విత్తనాలు, ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేసేందుకు కూడా ఈ సాంకేతికత ఉపయోగపడనుంది. దీంతో రైతు భరోసా పథకం మరింత పారదర్శకంగా, నిజమైన రైతులకు ఉపయోగపడేలా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# డ్రగ్స్ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ డా. సత్య శారద

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ (ఎన్‌సీఓఆర్‌డీ) సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "నిషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని, ఇందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి పురోగతి నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం అనంతరం నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ డా. సత్య శారద ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాంబశివరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రాజమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







# నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

- ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ జూన్ 22(ప్రభాత గమనం):**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ దరా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయానికి నిరసనగా ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 23 వేల పాఠశాలలను మూసివేసి, మూడు లేదా నాలుగు మండలాలకు ఒకే తెలంగాణ పబ్లిక్ స్కూల్ లేదా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.






# బాధితులకు అండగా 'భరోసా కేంద్రం'

- సత్వర న్యాయం, పునరావాసమే లక్ష్యం
- ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్

**ప్రభాతగమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఆధ్వర్యంలో ఈ రోజు జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లైంగిక వేధింపులు, పోక్సో, గృహహింస వంటి కేసుల బాధితులకు వైద్యం, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పరిహారం, ఆశ్రయం మరియు పునరావాస సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భరోసా సెంటర్ ద్వారా ఈ ఏడాది ఇప్పటివరకు బాధితులకు కౌన్సెలింగ్, వైద్య సహకారం, న్యాయ సహాయం, పరిహార ప్రతిపాదనలు, ఆశ్రయం, విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడ్డాయి. అలాగే పలు పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కీలక పాత్ర పోషించింది. బాధితులకు తక్షణ న్యాయం, భద్రత మరియు గౌరవప్రదమైన పునరావాసం కల్పించడంలో ములుగు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏ ఎస్పీ మనన్ భట్ ఐ పి ఎస్ , డీఎస్ పి కిషోర్ కుమార్, డి డబ్ల్యూ ఓ ప్రేమలత, ఎస్ ఐ రాజ్యలక్ష్మి మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, దర్యాప్తు అధికారులు మరియు భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దాం

- ఏఎస్ఐ మనోహర్ రావు పిలుపు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పర్వతగిరి ఏఎస్ఐ మనోహర్ రావు పిలుపునిచ్చారు. ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్ ఫోర్స్' తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంని ఏర్పాటు చేయడంజరిగింది. జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ పాక రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువు కన్నా సంస్కారం,క్రమశిక్షణ ఎంతో మిన్న అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ఎంత ముఖ్యమో, వారు డ్రగ్స్, మద్యపానం, ధూమపానం లాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూసుకోవడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. విద్యార్థులు తప్పుడు స్నేహితులను ఎంచుకుని తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు. 'క్రమశిక్షణకు మాతృభాష మౌనం' అని పేర్కొంటూ, విద్యార్థులు నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, రమేష్, కభీర్, శ్రావణ్ రెడ్డి లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374